## కరెంట్ షాక్‌తో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి

కరీమాబాద్, అక్టోబర్ 24: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మామునూరు 4వ బెటాలియన్ 2018 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సోమవారం మృతిచెందాడు. రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గూడెల్లి రాజేశ్(30) (పీసీ నంబర్ 493) బెటాలియన్‌లో మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ విభాగంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి ఉద్యోగులు విద్యుత్ సరఫరా నిలిపివేసి సీపీఆర్ చేస్తూ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఆరు నెలల వయస్సు గల కుమారుడు ఉన్నారు. రాజేశ్ మృతిపై బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది తమ సంతాపాన్ని తెలియజేశారు.



గూడెల్లి రాజేశ్ (ఫైల్)

## వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

దుగ్గొండి, అక్టోబర్ 24: వేర్వేరు కారణాలతో ముగ్గురు మృతిచెందిన ఘటనలు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జరిగాయి. ఎస్సై జక్కుల పరమేశ్వర్ కథనం ప్రకారం.. మండలంలోని చాపలబండకు యాదగిరి రాజ్‌కుమార్(39) సోమవారం ఉదయం బట్టలు ఆరేస్తుండగా కరెంట్ షాక్ గురై మృతిచెందాడు. మల్లంపల్లికి చెందిన కొండపాక పార్వతమ్మ(46) సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో ఊడుస్తుండగా విద్యుత్ జేవైరు తగిలి మృతిచెందింది. కేశవాపురానికి చెందిన అరదసండే రజినీకాంత్(30) గిర్నిబావి నుంచి స్వగ్రామానికి వస్తుండగా పొనకల్ చెరువుకట్టపై ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతులు ముగ్గురు వివాహితులు కావడంతో పండుగ పూట ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఏషియన్ పారా గేమ్స్‌లో కల్లెడ యువతికి స్వర్ణం

పర్వతగిరి, అక్టోబర్ 24: చైనాలోని హాంగ్‌జౌలో జరుగుతున్న ఏషియన్ పారా గేమ్స్‌లో కల్లెడ క్రీడాకారిణి దీప్తి జీవంజి అద్భుతమైన ప్రతిభ కనబరిచి మంగళవారం స్వర్ణం సాధించింది. అథ్లెటిక్స్ మహిళల టీ-20 విభాగంలో 400 మీటర్ల పందెంలో మండలంలోని కల్లెడ క్రీడాకారిణి దీప్తి జీవంజి ప్రతిభ కనబరిచింది. 56.69 సెకన్లలో అత్యద్భుత విజయాన్ని నమోదు చేసింది. భారత్ నుంచి దీప్తి జీవంజీ, ప్రాచీ యాదవ్ మంగళవారం స్వర్ణం సాధించి విజయపతాక ఎగురవేసి చరిత్ర సృష్టించడంపై కల్లెడ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



స్వర్ణ పతకం చూపుతున్న దీప్తి జీవంజి

## చెరువులో మునిగి వ్యక్తి మృతి

### గుమ్మళ్లపల్లిలో తామర పూల కోసం వెళ్లగా ప్రమాదం

కాటారం, అక్టోబర్ 24: తామరపూల కోసం చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లిలో ఆదివారం జరిగింది. కాటారం ఎస్సై అభినవ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భక్తు రాములు, దుర్గమ్మ కుమారుడు గణేశ్(26) కొద్ది పాటి దివ్యాంగుడు. పెయింటర్‌గా పనిచేసేవాడు. దామెరకుంటకు చెందిన సమర్యాను వివాహం చేసుకోగా నాలుగేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. సద్దులరోజు బతుకమ్మ పేర్చేందుకు తామరపూలు తీసుకొని అత్తగారింటికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ ఊరచెరువులోకి ఒంటరిగా దిగి తామరపూలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో అత్తగారింటికి భార్య వద్దకు వెళ్లాడని తల్లిదండ్రులు, పుట్టింటి వద్దే ఉండొచ్చని భార్య పిల్లలు భావించారు. మంగళవారం చేపలవేటకు వెళ్లగా ఊరచెరువులో మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా గ్రామస్తులతో వెళ్లి చూడగా గణేశ్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గణేశ్ (ఫైల్)

# పశ్చిమ బీజేపీలో అసంతృప్తి గళం

- తొలి జాబితాలో అవకాశం దక్కని ఏనుగుల రాకేశ్‌రెడ్డి
- అధిష్ఠానంపై తీవ్ర ఆగ్రహంతో ఆయన అనుచరులు
- ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని యోచన
- ముఖ్య నేతల సమావేశాల తర్వాత వెల్లడించే చాన్స్

వరంగల్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితా ఆదివారం ప్రకటించిన తర్వాత భారతీయ జనతా పార్టీలో అసంతృప్తి సెగలు తీవ్రమవుతున్నాయి. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీజేపీలో వర్గపోరు కొనసాగుతున్నది. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి వర్గం పార్టీపై అసంతృప్తి గళం పెంచారు. బీజేపీలో లావాదేవీలతోనే టిక్కెట్ ఖరారైందని ఈవర్గం ఆరోపించారు. గెలుపు ప్రాతిపదిక కాకుండా ఇష్టం వచ్చినట్లుగా టిక్కెట్లు ఖరారు చేశారని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ సీట్లు గెలిచేలా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఆశించామని, దీన్ని ప్రామాణికంగా తీసుకోకుండా పార్టీ నిర్ణయించిందని చెబుతున్నారు. బీజేపీ అధిష్టానం నిర్ణయంపై ఏనుగుల రాకేశ్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసినప్పటికీ అన్యాయం చేశారని ఆయన వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఐదేండ్లుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలతో రాకేశ్‌రెడ్డి పార్టీ శ్రేణులను ఏకం చేశారని, ఆయనకు అవకాశం ఇవ్వకపోవడం సరికాదని అనుచరులు చెబుతున్నారు. బీజేపీ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రాకేశ్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. బీజేపీలోని ఎక్కువ మంది నాయకులు, కార్యకర్తలు మీ వెంట ఉంటామని ఆయనకు హామీ ఇచ్చినట్లు సమాచారం. బీజేపీలో యువతకు అవకాశం ఇవ్వాలని, పార్టీ అధిష్టానం చేసిన పొరపాటును ఇండిపెండెంట్‌గా పోటీచేసి సరి చేయాలని ఆయన్ను కోరినట్లు తెలిసింది. బీజేపీ టిక్కెట్ ఇవ్వకపోవడంతో వరంగల్ పశ్చిమలో కచ్చితంగా పోటీ చేసేందుకు రాకేశ్‌రెడ్డి సిద్ధపడినట్లు తెలిసింది. త్వరలోనే నియోజకవర్గంలోని బీజేపీ ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహించి అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటిస్తారని ఆయన వర్గీయులు అంటున్నారు. మరికొన్ని సెగ్మెంట్లలోనూ బీజేపీలో తిరుగుబాటు మొదలవుతున్నది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఏకంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసే వరకు వెళ్లింది. వరంగల్ పశ్చిమ (హనుమకొండ) సెగ్మెంట్లలో 1999 ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. ఆ తర్వాత ఆ పార్టీకి ఎప్పుడూ గణనీయమైన ఓట్లు దక్కలేదు. బీజేపీలోని నియోజకవర్గ, జిల్లా నాయకత్వం కారణంగానే పార్టీకి ప్రస్తుత పరిస్థితి వచ్చిందని కాషాయ నేతలు వాపోతున్నారు. 2004, 2009, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీస స్థాయిలోనూ బలం చూపలేదని.. పార్టీ అధిష్టానం ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోవాలని అంటున్నారు. గతంలో వరంగల్ తూర్పు సెగ్మెంట్‌లో పోటీ చేసిన రావు పద్మకు, ఇప్పుడు పశ్చిమ టికెట్ కేటాయించడం ఏమిటని బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రావు పద్మ 2014లో వరంగల్ తూర్పులో పోటీ చేయగా, ప్రస్తుతం సీటు మార్చారు. బీజేపీ అధిష్టానం నిర్ణయాలు ఇలా ఇష్టం వచ్చినట్లు ఉండడంపై ఆ పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాకేశ్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తే మద్దతు ఇస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

# రూ.3కోట్ల బంగారం పట్టివేత

- కోమల్ల టోల్‌గేట్ వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం

రఘునాథపల్లి, అక్టోబర్ 24: పోలీసులు సోమవారం అర్ధరాత్రి భారీ బంగారాన్ని పట్టుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు మండలంలోని కోమాల్ల టోల్‌గేట్ వద్ద తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి బీవీసీ లాజిస్టిక్ సంస్థకు చెందిన వాహనంలో బంగారాన్ని తరలిస్తుండగా ఎలక్షన్ కమిషన్ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నారు. టైటాన్ గోల్డ్ షాప్స్ కంపెనీకి చెందిన 2,506.56 గ్రాములు (రూ.1కోటీ 55లక్షల 4వేల 623 విలువ), మలబార్ గోల్డ్ షాప్స్‌కు చెందిన 2,934.836 గ్రాములు (రూ.1కోటీ 54లక్షల 48వేల 66) మొత్తం 5కిలోల 441 గ్రాములు పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.3కోట్ల 9లక్షల 53వేల 250 ఉంటుందని అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని ఐటీ డిపార్ట్‌మెంట్‌కు పంపి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రఘుపతి తెలిపారు.


పట్టుకున్న బంగారు ఆభరణాలను తూకం వేస్తున్న పోలీసులు

## బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

హసన్‌పర్తి, అక్టోబర్ 24: బైక్ అదుపు తప్పి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన సిద్దాపూర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సిద్దాపూర్‌కు చెందిన కొక్కిస రమేశ్(35) గీతకార్మికుడు. మంగళవారం ఉదయం యథావిధిగా తాటిచెట్టు ఎక్కి తిరిగి బైకుపై ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానికులు గమనించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు పరీక్ష చేసి మృతిచెందినట్లు నిర్ధారించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.


రమేశ్ (ఫైల్)

## మద్యం పట్టివేత

హసన్‌పర్తి, అక్టోబర్ 24: మండలంలోని సిద్దాపూర్‌లో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టి మద్యం పట్టుకున్నారు. సీఐ తుమ్మ గోపి ఆదేశాల మేరకు ఎస్సై అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా తాబేటి సాంబయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 19 బీర్లను స్వాధీనం చేసుకున్నారు. సాంబయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో క్రైమ్ కానిస్టేబుల్ క్రాంతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై కేసు

పర్వతగిరి, అక్టోబర్ 24: మండల కేంద్రానికి చెందిన జూలపెల్లి రవీందర్‌రావుపై దాడి చేసి తలకు తీవ్రంగా గాయం చేసిన జూలపెల్లి బుచ్చిరామారావు, రీతు రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇమ్మిడి వీరభద్రరావు మంగళవారం తెలిపారు. రవీందర్‌రావు, బుచ్చిరామారావు మధ్య కొన్నేండ్లుగా భూమి తగాదాలు, కోర్టు కేసులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గొడవ తీవ్ర స్థాయిలో చేరింది. కాగా రవీందర్‌రావు, బుచ్చిరామారావు పరస్పర దాడిలో బుచ్చిరామారావుకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

# దసరా పండుగ వేళ విషాదం

- ఈతకు వెళ్లి చెక్‌డ్యామ్‌లో మునిగి ఇద్దరి మృతి
- నడికూడ మండలం నార్లాపూర్‌లో ప్రమాదం
- మృతులిద్దరూ అన్నదమ్ములు
- వరికోల్ గ్రామంలో తీవ్ర విషాదం

నడికూడ, అక్టోబర్ 24: దసరా పండుగ వేళ ఓ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. అత్తగారింటికి వచ్చిన ఇద్దరు అల్లుళ్లు నార్లాపూర్ చెక్ డ్యామ్‌లో ఈతకు కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. పరకాల సీఐ జూపల్లి వెంకటరత్నం, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. రేగొండ మండలం పెద్దంపల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన దొపతి సమ్మిరెడ్డి కుమారులు దొపతి జగన్‌రెడ్డి (33), దొపతి మల్లారెడ్డి(31) మండలంలోని వరికోల్‌కు చెందిన రెండు వేర్వేరు కుటుంబాలకు చెందిన వారితో గతంలో వివాహం జరిగింది. ఒకరు హైదరాబాద్, మరొకరు చెన్నైలో సాఫ్ట్‌వేర్, బ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగ కోసం వరికోల్‌కు చేరుకున్నారు. కాగా, సోమవారం దసరా పండుగ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అంతా కలిసి పక్క గ్రామం నార్లాపూర్‌లో ఉన్న చెక్ డ్యామ్ వద్దకు వెళ్లారు. తమ పిల్లలతో ఆడుకుంటూ గడిపారు. అనంతరం వాగులో సరదాగా ఈత కోసం వెళ్లి లోతు తెలియక నీళ్లలో ప్రమాదవశాత్తు పడి చనిపోయారు. మృతులిద్దరికీ ఇద్దరు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సీఐ వెంకటరత్నం, ఎస్సై శివకృష్ణ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పంచనామా చేసి పోస్టుమార్టంకు తరలించారు.


నార్లాపూర్ చెక్ డ్యామ్‌లో పడి మృతిచెందిన జగన్‌రెడ్డి, మల్లారెడ్డి(ఫైల్)